ఎంజీఎంలో ఆర్‌ఎంపీల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: స్థానిక ఎంజీఎం ఆసుపత్రి ఆవరణలో శ్రీకాళహస్తి, పరిసర ప్రాంతాల్లో ప్రాథమిక వైద్యం అందిస్తున్న ఆర్‌ఎంపీ డాక్టర్లతో ఎంజీఎం యాజమాన్యం ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ పట్టణంతోపాటు పల్లెల్లో ప్రజలకు అత్యవసర ప్రాథమిక వైద్యం అందిస్తున్నందుకు ఆర్‌ఎంపీ డాక్టర్లను అభినందించారు. స్థానిక ఎంజీఎం ఆసుపత్రిలో అతి తక్కువ ఖర్చుతో కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామనీ, శ్రీకాళహస్తి ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. ఆర్‌ఎంపీ డాక్టర్లను ఒక్క తాటిపైకి తీసుకొచ్చి ఆత్మీయ సమావేశం నిర్వహించినందుకు ఎంజీఎం సంస్థలకు ఆర్‌ఎంపీలు కృతజ్ఞతలు తెలియజేశారు.

గుంతల్లో రోడ్లు

- దారుణంగా దెబ్బతిన్న దారులు
- వర్షాలకు కంకర తేలి గుంతలు..
- నీళ్లతో బురదమయం
- ప్రయాణికుల పాట్లు..
- పెరుగుతున్న ప్రమాదాలు
- నిద్రావస్థలో అధికారులు

వాహనాల్లో రోడ్డు మీదకొస్తే సౌకర్యవంతంగా ప్రయాణించే పరిస్థితులు లేవు. తారు అంతా కొట్టుకుపోయి.. పైకి తేలి చెల్లాచెదురైన కంకర.. ఎక్కడికక్కడ పెద్దపెద్ద గుంతలు.. వాటిలో నీళ్లు నిండి.. బురదమయమై.. మనం ప్రయాణం చేస్తోంది రోడ్డు మీదేనా? అన్న అనుమానం వచ్చేలా చాలాచోట్ల రహదారులు ఘోరంగా మారాయి. పలుచోట్ల ద్విచక్రవాహనంపైనే కాదు.. కనీసం నడిచి వెళ్లే పరిస్థితి కూడా లేదు. ఏళ్ల తరబడి మరమ్మతులు చేయకపోవడం, ఇటీవల కురిసిన వానలకు మండల, గ్రామ రహదారులైతే మరీ అధ్వానంగా తయారయ్యాయి. రాత్రివేళల్లో సరిగా కనిపించక గుంతల్లోపడి వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. తాత్కాలిక మరమ్మతులైనా చేయాలని గ్రామస్తులు అధికారులను వేడుకుంటున్నారు.

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ

సత్యవేడు -శ్రీకాళహస్తి ప్రధానరోడ్డు మార్గం దుస్థితికి చేరుకుంది. రోడ్డుకు వేసిన కంకర పోవడంతో పలుచోట్ల గుంతలమయంగా మారింది. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో కోతలకు గురై రోడ్లు ధ్వంసమయ్యాయి. ప్రధానంగా సత్యవేడు నుంచి శ్రీకాళహస్తికు వెళ్లేమార్గం పదవ మైలు బుచ్చినాయుడు కండ్రిగ సమీపంలో ఏర్పడ్డ గుంతలు ప్రమాద భరితంగా మారాయి. వర్షాలకు గుంతల్లో నీళ్ళు నిలిచిపోవడంతో మడుగును తలపిస్తున్నాయి. పైగా సత్యవేడు నియోజకవర్గం ఎన్టీఆర్ నగర్ బుచ్చినాయుడు కండ్రిగ వారపుసంత, కారణంగా అనేక భారీగా వాహనాలు రావడం, అలాగే సత్యవేడు నుండి కాళహస్తి వైపు ఎలాంటి టోల్ ఫ్రీ చార్జీలు లేనందువలన అనేక భారీ వాహనాలు ఈ దారిగుండా రావడంతో రోడ్డు మార్గాలు ధ్వంసమై గుంతలు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో వాహన రాకపోకలు ఇబ్బందికరంగా మారింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఈ మార్గంలో వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిందే. మూడు రోజుల క్రితం బుచ్చినాయుడు కండ్రిగ మడలం పార్లపల్లి పంచాయతీలో కారు, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఒరిస్సాకు చెందిన ముగ్గురు యువకులు ప్రాణం కోల్పోయారు. ఇలాంటి సంఘటనలు ఈ రోడ్డు మార్గాన చాలా జరుగుతూనే ఉన్నాయి. వర్షాలకు గుంతల్లో నీళ్లు నిలిచిపోవడంతో ఇప్పటికే ద్విచక్ర వాహనదారులు పలువురు గుంతల్లో పడి ప్రమాదానికి గురైన సంఘటనలు ఉన్నాయి. గత ఏడాదిగా సత్యవేడు- శ్రీకాళహస్తి ప్రధాన రోడ్డు మార్గం దెబ్బతిని అధ్వానంగా ఉన్నా సంబంధిత రోడ్లు భవనాల శాఖ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం రోడ్లకు ఏర్పడ్డ గుంతలను పూడ్చడానికి కూడా చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించడం పట్ల సర్వత్ర విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ఈ మార్గంలో పలుచోట్ల ఏర్పడ్డ గుంతలకు ఒక తట్ట మట్టి పోసి పూడ్చాలన్న ధ్యాస సంబంధిత ఆర్ అండ్ బి అధికారులలో లోపించడం విమర్శలకు దారి తీస్తోంది. ఈ నేపథ్యంలో సత్యవేడులో ఆర్అండ్‌బి శాఖ ఉన్నట్టా? లేనట్టా? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు దీనిపై స్పందించి సత్యవేడు -శ్రీకాళహస్తి మార్గంలో ఏర్పడ్డ గుంతలను పూడ్చడానికి తగుచర్యలు తీసుకొని వాహనదారుల ప్రాణాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

గుంతలమయమైన సత్యవేడు - శ్రీకాళహస్తి రోడ్డు

ఈసీఎల్ ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్వాహకం

బురదమయమైన మార్గం..

బురదమయమైన చిందేపల్లి రోడ్డు

ఏర్పేడు మండలం చిందేపల్లి నుంచి ఈసీఎల్ ఫ్యాక్టరీ మధ్యలో వెళ్లే చటర్జీ నగర్ రోడ్డు, నాయుడుపేట-పూతలపట్టు నేషనల్ హైవేకు చేరుకునే చిందేపల్లి ఆర్ అండ్‌బి రోడ్డు భారీగా గుంతలు ఏర్పడి బురదమయమైంది. ఈ రోడ్డు మీదుగా 14 గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తూ ఉంటారు. చిందేపల్లి స్కూల్ పిల్లలు, వృద్ధులు, పక్కనే ఉన్న ఎస్టీ కాలనీవాసులు ఆ బురదలోనే కాలినడక ప్రయాణిస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో చిందేపల్లి ఆర్అండ్‌బి రోడ్డును కొంతమేరకు ఈసీఎల్ ఫ్యాక్టరీ విస్తరణ కొరకు రోడ్డుకి ఇరువైపులా గోడ నిర్మాణం చేసిన విషయం అందరికీ తెలిసిందే.. దీనికి ప్రత్యామ్నాయంగా తాత్కాలికంగా మట్టి రోడ్డును ఏర్పాటు చేశారు. అయితే ఆ రోడ్డు చిన్నపాటి వర్షానికే బురదమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. దాదాపుగా ఒక కిలోమీటరు పాటు ఈసీఎల్ ఫ్యాక్టరీ యాజమాన్యం వారి భారీ వాహనాలు రాకపోకల వలన వర్షాలు పడినప్పుడు ఉన్న కాస్త మట్టిరోడ్డులో భారీగా గుంతలుగా ఏర్పడి బురదమయంగా మారి ప్రయాణించాలంటే ప్రమాదకరంగా ఉంది. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ రోడ్డు మీద ప్రయాణించే వాహనదారులకు, శ్రీకాళహస్తికి వెళ్లే స్కూల్ పిల్లలకు నిత్యం నరకంగా మారింది. చాలా మంది వాహనదారులు బురదలో జారి పడి గాయాలపాలైన సంఘటనలూ లేకపోలేదు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి 14 గ్రామాల రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

బడి పిల్లల చింత తీరేనా..

- బయటకు రావాలంటేనే భయం
- ప్రమాదకరంగా గోతులు
- ఇనుప పిల్లర్లతో ఇబ్బందులు

సత్యవేడు మండలం చెరివి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు గత రెండేళ్లుగా అనేక సమస్యలతో అల్లాడుతున్నారు. కనీసం పాఠశాల ముందు భాగంలో ఖాళీగా ఉన్న స్థలాల్లో సాయంత్రం వేళల్లో ఆడుకోవాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. అక్కడ నెలకొన్న సమస్యలపై ఉపాధ్యాయులు మండల శాఖ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్న స్పందన లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇక వర్షాకాలంలో ఇక్కడ విద్యార్థులు తరగతిగదులకే పరిమితం కావలసిన దయనీయ పరిస్థితి ఏర్పడింది.

ప్రజాశక్తి- సత్యవేడు

చెరివి ప్రాథమికోన్నత పాఠశాలలో సుమారు 60మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విశాలమైన ఆట స్థలాలు అందుబాటులో ఉన్న వీరు సాయంత్రం వేళల్లో ఆట్లాడుకోవడం ప్రమాదకరంగా మారింది. పాఠశాల ఆవరణంలోనే గ్రామస్తులు, తల్లిదండ్రులు వద్దని నెత్తినోరు మొత్తుకున్నా.. సచివాలయ నిర్మాణానికి కొందరు పూనుకున్నారు. పాఠశాల ఆవరణలోనే ఈ భవనాలు ఏర్పాటు చేస్తే సమస్యలు వస్తాయని విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. పునాదులు తీసి కాంక్రీట్ పిల్లర్లు వేశారు. ఇంతలోనే హైకోర్టు ప్రజల పక్షాన ఓ మంచి తీర్పును ఇచ్చింది. పాఠశాల ఆవరణలో ప్రభుత్వ భవనాలు ఏవీ నిర్మించకూడదని తీర్పు ఇవ్వడం జరిగింది, దాంతో భవన నిర్మాణాలు ఆగిపోయింది. అయితే ఆ పిల్లర్ల చుట్టూ ఎక్కడపడితే అక్కడ ఇనుప కమ్మీలను అలాగే వదిలేశారు. దాంతో పిల్లలు అక్కడికి వెళ్లకుండా చూడటం ఉపాధ్యాయులకు భారంగా మారిపోయింది.

గోతులు, ఇనుప కమ్ములతో భయం భయం

అక్కడి పాఠశాల పరిసరాలు అధ్వానంగా ఉంది. ముఖ్యంగా ప్రహరీ లేకపోవడం వల్ల ఇబ్బందులతోపాటు ఓ పక్క సిమెంట్ పిల్లర్లు, వాటి చుట్టూ ఎక్కడబడితే అక్కడ ఇనుప కమ్మీలు దీనికి తోడు పక్కనే రైతు భరోసా భవన నిర్మాణానికి తీసిన పెద్దపెద్ద గోతులు ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయి. గంటసేపు వర్షం కురిసినా ఆ గోతుల్లో వర్షపు నీరు నిలబడిపోతుంది. కొందరు ముందు బాబులు అక్కడక్కడ మద్యం తాగి బాటిళ్లు ఇక్కడే పగలగొట్టి వెళ్లిపోతున్నారు. ప్రహరీ నిర్మాణానికి దాతలు ముందుకు వస్తున్నా కొందరు వ్యక్తిగత స్వార్థంతో సమస్యలు సృష్టిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు ఏ బుక్కుల్లో నమోదు కానీ పనులకు బిల్లులు అడుగుతుండటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు వీటిపై దృష్టిపెట్టాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే చొరవ చూపాలి..

విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే యుద్ధ ప్రాతిపదికన తమ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రమాదకర సమస్యలను తొలగించాలని, సచివాలయ నిర్మాణం కొరకు ఏర్పాటుచేసిన సిమెంట్ పిల్లర్లను తొలగించి, సమీపంలో ఉన్న పెద్దపెద్ద గోతులను పూడ్చివేయడానికి ఆదేశాలు ఇవ్వడంతో పాటు పాఠశాల చుట్టూ ప్రహరి నిర్మాణానికి చొరవ తీసుకోవాలని పాఠశాలలో చదువుతున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

శ్రీవారిని దర్శించుకున్న చీఫ్ సెక్రటరీ

ప్రజాశక్తి- తిరుమల: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ దంపతులు ఆదివారం ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు, డైరీ, క్యాలెండర్‌ను జేఈవో వీరబ్రహ్మం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఈఓ గౌతమి, డెప్యూటీ ఈవోలు లోకనాథం, హరీంధ్ర నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సాదర వీడ్కోలు

రేణిగుంట: రెండు రోజుల తిరుమల తిరుపతి పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం తిరుగు పయనమైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌కి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, టీటీడీ జేఈఓ గౌతమి, జెసి ధ్యానచంద్ర, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ తదితరులు రేణిగుంట విమానాశ్రయం నందు సాదర వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిఎస్ దంపతులకు శ్రీవేంకటేశ్వర స్వామి వారి ప్రతిమను అందచేశారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ పరీక్షలు

పేపర్ 1 పరీక్షకు 55.71 శాతం, పేపర్ 2కు 55.80 శాతం మంది హాజరు

ప్రజాశక్తి- తిరుపతిటౌన్

యూపీఎస్సీ కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్-2024 పరీక్షలు ఆదివారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. ఉదయం 9.30 నుండి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30గంటల వరకు రెండు సెషన్లలో పరీక్ష నిర్వహణ జరిగిందన్నారు. తిరుపతిలో నిర్వహించిన 3 పరీక్షా కేంద్రాలలో యూపీఎస్సీ కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ పరీక్షలకు 1199 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఉదయం పేపర్ 1 పరీక్షకు 668మంది 55.71 శాతంగా, మధ్యాహ్నం పేపర్ 2 పరీక్షకు 669 మంది 55.80శాతం మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. పరీక్ష పత్రాలను స్ట్రాంగ్ రూమ్ నుండి బందోబస్తు నడుమ సంబంధిత పరీక్ష కేంద్రాలకు తరలించడం జరిగిందని, అభ్యర్థులకు పరీక్ష కేంద్రంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించామని కలెక్టర్ తెలిపారు. కేంద్ర యుపిఎస్సి నిబంధనల మేరకు అన్నివిధాల పకడ్బందీ చర్యలు చేపట్టి పరీక్షలు నిర్వహించామని, అన్ని శాఖల సమన్వయంతో పరీక్షలను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి ఐదుగురు ఎంపిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి పట్టణం కొత్తపేటలో గల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన ఐదు మంది విద్యార్థినులు నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఇందులో ఎన్.హారిక, ఎస్కే సుమయా, ఎస్కే యాస్మిన్, ఎ.నవ్యశ్రీ, ఎ.నూతనశ్రీ ఉన్నారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయసుధ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉచిత మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఎస్వీఎస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. స్థానిక రాజన్న పార్క్ ఎదురుగా ఉన్న ఎస్వీఎస్ హాస్పిటల్ లో డాక్టర్ రఘురాములు ఆధ్వర్యంలో జనరల్ ఫిజీషియన్, డయాబెటాలజి, క్రిటికల్ కేర్ స్పెషలిస్టులచే వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 300 రోగులు హాజరై వైద్యసేవలు పొందారు. డాక్టర్ కృష్ణకుమార్, ఆస్పత్రి సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు న్యాయం చేస్తాం

సహాయ కార్మిక అధికారి రంగనాథ్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బుచ్చినాయుడు కండ్రిగ మండలం పార్లపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం తరపు నుంచి సాయం, న్యాయం అందేలా చూస్తామని శ్రీకాళహస్తి సహాయకార్మిక అధికారి రంగనాథ్ హామీ ఇచ్చారు. మృతి చెందిన కార్మికులు పనిచేస్తున్న శ్రీనిధి రాజా ప్యాకింగ్ పరిశ్రమను ఆదివారం సహాయ కార్మిక అధికారి రంగనాథ్ పరిశీలించారు. మృతుల వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలు, గుర్తింపు కార్డులు తదితర అంశాలను సంబంధిత కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇచ్చారు.

17న మలయాళ స్వామి పుస్తక ఆవిష్కరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఏర్పేడు మండల కేంద్రానికి సమీపంలో గల వ్యాసాశ్రమంలో ఈ నెల 17వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3గంటలకు మలయాళ స్వామి పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని శ్రీకాళహస్తి సామాజిక సమరసతా వేదిక సభ్యులు అంజూరు బాలసుబ్రమణ్యం, వీరాస్వామి, ఈశ్వరయ్య, శంకరయ్య, సప్పిడి సుబ్బరామిరెడ్డి, చిలకా రంగయ్య తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మలయాళ స్వామి 1919లో రచించిన పుస్తకాన్ని తిరిగి ముద్రించి సమరసత గురించి నాడు స్వామి చెప్పిన విషయాలను నేటి తరానికి అందించడానికి ఈ పుస్తక ఆవిష్కరణ చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జయప్రదం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు కోరారు.

పాఠశాలను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - డక్కిలి: డక్కిలి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఆదివారం పాఠశాలల జిల్లా కన్వీనర్ సుశీల, జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీహరి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో వారు మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల క్షేమం పట్ల అలసత్వం, విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. అంతకుముందు వారు ధర్నా నిర్వహిస్తున్న ఎంఆర్పిఎస్, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులతో చర్చించి షరీనా మృతిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

ఎమ్మార్పీఎస్, ప్రజాసంఘాల ధర్నా

గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్, సిబ్బంది నిర్లక్ష్యంతో మృతిచెందిన దళిత విద్యార్థి షరీనా మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకొని బాధిత కుటుంబ సభ్యులను ఆదుకోవాలని కోరుతూ ఆదివారం స్థానిక కమ్మపల్లిరోడ్డు సెంటర్లో ఎమ్మార్పీఎస్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు సూరిపాక వాసుదేవర మాదిగ మాట్లాడుతూ డక్కిలి గురుకుల పాఠశాల నందు దళిత విద్యార్థిని మృతి చెంది 72 గంటలు కావస్తున్న ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం దారుణమన్నారు. జిల్లా అధ్యక్షులు వేలూరు రాజేంద్ర మాదిగ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న గురుకుల పాఠశాలలో ఇలాంటి విషయాలు పునరావృతం కాకుండా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి జరిగిన సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధ్యులను శిక్షించాలని లేనిపక్షంలో అన్ని గురుకుల పాఠశాలలో ఉన్న సమస్యలను అధ్యయనం చేసి తిరుపతి జిల్లా స్థాయిగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఏపీ ప్రజాసంఘ ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునియ్య, ఉదయ్, పల్లిపాటి రవి మాదిగ, మంగళపూరి సురేష్ మాదిగ, కంటిపల్లి మనీ మాదిగ, చింతగుంట అంకయ్య, వెంకీ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన చెట్టు

మూడు వాహనాలు ధ్వంసం

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల బాటగంగమ్మ ఆలయం వద్ద పార్కింగ్ ప్రాంతాల్లో శనివారం రాత్రి కురిసిన వర్షానికి భారీ చెట్టు కూలింది. దీంతో పార్కింగ్‌లో ఉన్న రెండు టెంపో వాహనాలు, ఒక కారు ధ్వంసమయ్యాయి. తమిళనాడుకు చెందిన భక్తులు వరహస్వామి అతిథి గృహంలో గది పొంది పార్కింగ్‌లో వాహనాలు పార్క్ చేశారు. ఈదురు గాలులు, వర్షం తీవ్రతకు చెట్టు వాహనాలపై కూలింది. చెట్టు కూలిన ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. ఆదివారం ఉదయం 8గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది.

అపరిశుభ్రంగా చేపల మార్కెట్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: చేపల మార్కెట్ వద్ద పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో డెంగీ, డయేరియా వ్యాధులు వ్యాపించే అవకాశాలున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేపల మార్కెట్ వద్ద ప్రతిరోజు పారిశుధ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా మురుగునీటి కాలువలు వద్ద బ్లీచింగ్ చల్లడం, దోమల నివారణ కోసం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. చేపల మార్కెట్ వద్ద వర్షాకాలంలో దుర్గంధం ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ ఎక్కువమంది పారిశుద్ధ కార్మికులు నివసిస్తూ ఉంటారు. ఆదివారం లీలామహల్ రోడ్డులోని మునిసిపల్ చేపలమార్కెట్ వద్ద దుస్థితి చూస్తుంటే వ్యాధులు వ్యాపించి ఆసుపత్రిపాలయ్యే ప్రమాదం కనబడుతుంది. ఇప్పటికే నగరపాలక సంస్థలో అనేక మురికివాడలో అతిసార, డెంగీతో ఆసుపత్రి పాలవుతున్న విషయం తెలిసింది. ఈ చేపలమార్కెట్ వ్యర్థాల వల్ల చిన్నపాటి వర్షం పడినా విపరీతమైన వాసనతోపాటు దోమలతో శంకర్ కాలనీ, యానాది కాలనీ, స్కావెంజర్స్ కాలనీ, మదురా నగర్ వాసులకు అవస్థలు తప్పడం లేదు. చాలా వరకు తిరుపతి నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్యం కార్మికులు మార్కెట్‌కు ఎదురుగా ఉన్న స్కావెంజర్స్ కాలనీలోనే ఉంటున్నారు. వారిలో కొందరు అనారోగ్యంతో బాధపడుతున్నారు. అయినా అధికారులు ఇక్కడ సమస్యను చూసి వెళుత్తున్నారు తప్ప పారిశుధ్యం పట్ల చర్యలు చేపట్టడం లేదు. చేపల మార్కెట్‌ను అక్కడి నుంచి తరలించాలని అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ చేపల మార్కెట్‌ను తరలించి పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. సోమవారం జరిగే ప్రజాపరిష్కారాల వేదికలోనైనా ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

డిజిపిని కలిసిన ఎమ్మెల్యే

డిజిపిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి -రామచంద్రాపురం: ఏపీ డీజీపీ ద్వారక తిరుమల రావు మొట్టమొదట తిరుపతి పర్యటనకు విచ్చేసిన సందర్భంలో ఆదివారం యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పక్కన పోలీసుల అతిథి గృహంలో చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిజిపిని దుశ్శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలోని పోలీసు స్టేషన్‌లకు పూర్తి స్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేయాలని, పోలీస్ స్టేషన్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. నియోజకవర్గంలోని పోలీస్ స్టేషన్ల పరిధిలలో ప్రధాన ప్రాంతాలలో నిఘా నేత్రాలు ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గ కేంద్రమైన చంద్రగిరిలో పోలీస్ సిబ్బంది నివసించేందుకు పోలీస్ క్వార్టర్స్ స్థలం వుందని క్వాటర్స్ నిర్మాణంపై డీజీపీతో చర్చించారు. ఈ కార్యక్రమంలో వి సుబ్రహ్మణ్యం నాయుడు, ఏ ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న టిడిపి నాయకులు

గ్రామస్తుల మొక్కులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరిలో భారీ మెజార్టీతో గాలి భాను ప్రకాష్ గెలు పొందడంతో పుత్తూరు మున్సిపాల్టీ పరిధిలోని మొదటి వార్డు కట్ట కంద రామకృష్ణాపురంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగ రెడ్డి ఆధ్వర్యంలో గంగమ్మకు ఆదివారం పొంగళ్ళు పెట్టి, అంబలి పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా బిసి సెల్ అధ్యక్షులు షణ్ముగరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు నగరి నియోజక వర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా గాలి భాను ప్రకాష్‌ను ప్రకటించిన తర్వాత పుత్తూరు మున్సిపాల్టీలో ఎన్నికల ప్రచారం ఈశాన్య ప్రాంతమైన కటకంద రామకృష్ణాపురంలో ప్రారంభించామన్నారు. భానుప్రకాష్‌కు 45 వేల మెజార్టీ రాగా తమ వార్డులో 456 ఓట్లు మెజార్టీ వచ్చిందని తెలిపారు. గాలి భాను ప్రకాష్ భారీ మెజార్టీతో విజయం సాధించడంతో గంగమ్మకు మొక్కులు తీర్చుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగ రెడ్డి, జిల్లా టిఎన్‌టియుసి కార్యదర్శి పండారం మణి, పుత్తూరు పట్టణ బీసీ సెల్ ఉపాధ్యక్షులు సంతోష్ వార్డు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చొక్కాలింగారెడ్డి, అర్జున్ రెడ్డి, మహేష్, నారాయణ, సుబ్రహ్మణ్య రెడ్డి, గోవింద స్వామి రెడ్డి, ఉమాపతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జీవరత్నం నాయుడు జన్మదిన వేడుకలు

జీవరత్నం నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌను : టిడిపి పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, డిజీ ధనపాల్ ఆధ్వర్యంలో గాలి జీవరత్నం నాయుడు 59వ జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. టిడిపి కార్యకర్తలు, నాయకులు మధ్య జన్మదిన కేకును కట్ చేసి పంచిపెట్టారు. బాణాసంచా పేల్చి ఆయనకు నాయకులు శాలువాలతో, పూల మాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గాలి జీవరత్నం నాయుడు ఆయురా రోగ్యాలతో సుఖ సంతో షాలతో మరెన్నో పదవులు చేపట్టాని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, నాయకులు , శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

దళితుడిపై దాడి హేయం: కేవీపీఎస్

ప్రజాశక్తి-గంగవరం:

కడప జిల్లాలో దళితుడిపై అగ్రకులస్తులు సలసల కాగే వంట నూనె పోసి దాడి చేయడం హేయమైన చర్య అని కేవీపీఎస్ జిల్లా నాయకులు ఈశ్వర్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం కడప జిల్లాలో జరిగిన సంఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 77ఏళ్ల స్వాతంత్ర భారతదేశంలో ప్రపంచానికే ఆదర్శమైన రాజ్యాంగం అమలులో ఉన్నప్పటికీ ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా దళితుల మానప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఉన్మాదుల్లా దళితులపై దాడికి తెగబడటం దుర్మార్గమన్నారు. సంఘటనపై వెంటనే ప్రభుత్వం స్పందించి దోషులను తీవ్రంగా శిక్షించాలని, బాధితుడు ప్రభాకర్‌కు మెరుగైన వైద్యం అందించాలని కేవీపీఎస్ జిల్లా నాయకులు ఈశ్వర్, సుబ్రమణ్యం డిమాండ్ చేశారు.

చెరువు భూములకు విముక్తి

ప్రజాశక్తి-కుప్పం టౌన్:

శెట్టిపల్లి పంచాయతీకి చెందిన కప్పలనత్తం గ్రామంలో కబ్జాకు గురి అయిన చెరువు భూములకు ఆదివారం విముక్తి కలిగింది. పంచాయతీ పరిధిలో పలు చెరువులు అక్రమ దారుల చెరలో ఉన్నట్టు గ్రామపంచాయతీ సర్పంచ్, టీడీపీ నాయ కులు రీటా ఎల్లప్ప గత కొంతకాలంగా ఆరోపిస్తున్నారు. గత నెలలో విడుదలైన ఎన్నికల ఫలితాల ప్రకారం టీడీపీ రాష్ట్రంలో అధికారం చేపట్టడంతో రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితులలో మార్పు వచ్చింది. ఇందులో భాగంగా శెట్టిపల్లి గ్రామ సర్పంచ్ చెరువు ఆక్రమణలను తొలగించే పనులకు కార్యరూపం దాల్చారు. ఇందులో భాగంగా ఆదివారం గ్రామ పరిధిలోని అప్పయ్య చెరువు సర్వే పనులను చేపట్టారు. ఈ సర్వే ద్వారా చెరువు సుమారు రెండు ఎకరాల భూమి దురాక్రమనకు గురైనట్టు అధికారుల వల్ల బహిర్గితమైనట్టు సర్పంచ్ తెలిపారు. సర్వే పనులు ముగిసిన వెంటనే చెరువు చుట్టూ కందకాలు తవ్వి భవిష్యత్తులో ఎవరు దురాక్రమనకు పాల్పడకుండా చర్యలు చేపట్టినట్టు సర్పంచ్ తెలిపారు.

ఉపాధ్యాయుల్లో ఉద్యమ స్ఫూర్తి నిండాలి

- యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత

ప్రజాశక్తి-బంగారుపాళ్యం:

ఉపాధ్యాయుల్లో ఉద్యమ స్ఫూర్తి నిండాలి యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత అన్నారు. ఆదివారం ఎస్ఆర్ పురం మండలంలో ఉపాధ్యాయుల ఉద్యమ స్ఫూర్తి శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పిన హామీలను నెరవేర్చడంలో విఫలమవుతున్నారని అధికారం చేపట్టేందుకోసం హామీలను తెలిపి అధికారం చేపట్టిన తర్వాత గత ప్రభుత్వం అవలంభించిన విధానాలతో హామీలు నెరవేర్చడంలో విఫలమవుతుందన్నారు. అనంతరం రాష్ట్ర యుటిఎఫ్ అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు, మండల యూటీఎఫ్ అధ్యక్షులు మొగులయ్య, కార్యదర్శి మోహన్ రెడ్డి తదితరులు కలిసి యుటిఎఫ్ అభివృద్ధికి చేపట్టాల్సిన విధివిధానా గురించి చర్చించారు.

శిథిలావస్థలో పశువైద్యశాల

- పెచ్చులూడి పడుతున్న పై కప్పు
- విష సర్పాలు, తేళ్లకు ఆవాసం
- పదేళ్లు గడుస్తున్నా మారని దుస్థితి

పెచ్చులూడి పడి దుస్థితికి చేరిన పశువైద్యశాల

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండల కేంద్రంలోని పశు వైద్యశాల దాదాపు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. అయినా అనేక సంవత్సరాలుగా శిథిలమైన భవనం లోనే ఉప విభాగ స్థాయి వైద్యాధికారి పశువులకు వైద్యం కొనసాగిస్తున్నారు. ఈ పశువైద్యశాల భవనం 1988లో నిర్మించినప్పటికీ నాసిరక నిర్మాణం కారణంగా ఈ భవనం 10 సంవత్సరాల క్రితమే శిథిలావస్థకు చేరుకుంది. అసలే చిన్న భవనం.. ఎటుచూచినా వర్షపు నీరు కారుతూ పెచ్చులు ఊడి దర్శనమిస్తోంది. పైకప్పులోనూ పాములు, తేళ్ల ఆవాసానికి అనుకూలమైన గుంతలు, రంధ్రాలతో కూడిన గోడలు దర్శనమిస్తున్నాయి. ఈ పశు వైద్యశాల సత్యవేడు పట్టణాన్ని ఆనుకొని ఉన్న దళవాయి అగ్రహారం, కోమటి గుంట, బీసీ కాలనీ, పోలీస్ క్వార్టర్స్ ప్రాంతాలలోని పశువులకు అతి సమీపంలో ఉన్న తమిళనాడు కు చెందిన కొన్ని గ్రామాలు, సత్యవేడు మండలానికి చెందిన ఈ వైద్యశాల పరిధిలో వున్నాయి. ఈ పశువైద్యశాల పరిధిలోకి రాని మరికొన్ని గ్రామాలకు సంబంధించిన పశువులకు దాదాపు వెయ్యి గేదెలు, 1600 ఆవులు, 4వేలు గొర్రెలు మేకలు, 1300 పైగా కోళ్లకు వైద్యం ఈ వైద్యశాలలోనే నిత్యం అందించాల్సి వుంది. ఈ వైద్యశాలలో డివిజనల్ స్థాయి అధికారి ఉండటానికి, పరిధిలోని వైద్యశాలలకు అవసరమైన అనేక వైద్య పరికరాలు, వైద్య సంబంధిత ఔషధాలు నిల్వ చేయాల్సి వుండడంతో వైద్యశాల లోపల కనీసం కూర్చోవడానికీ స్థలం లేని పరిస్థితి ఏర్పడుతోంది. దీనికి తోడు వర్షపు నీరు కారుతున్న కారణంగా ఎంతో ఖరీదైన వైద్య సామగ్రి, ఔషధాలు తడిచి త్వరగా పాడైపోతున్నాయి. గతంలో అనేకసార్లు ఈ వైద్యశాలకు సంబంధించి దినపత్రికల్లో వార్తా కథనం ప్రచురితం కావడంతో కొంత స్థలాన్ని ఈ వైద్యశాల నిర్మాణానికి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే ఇప్పటి వరకు భవన నిర్మాణానికి నోచు కోలేదు. ఈ కారణంగా ఈ పశువైద్యశాల దుస్థితిలో కొన సాగు తోంది. పాలకులు, ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందిం చాలని స్థానిక పాడి రైతులు కోరుతున్నారు.

దిద్దుబాటు చర్య !

ప్రజాశక్తి- బుచ్చినాయుడు

కండ్రిగ: తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలం అని పుత్తూరు గ్రామపంచాయతీలో గతంలో రైతు సేవా కేంద్రంలో గతంలో శిలాఫలకంపై ప్రోటోకాల్ లేని పేర్లు ఉండటంతో దానిపై మండలంలో కొన్ని వ్యతిరేకతలు వచ్చాయని ప్రస్తుత టిడిపి సత్యవేడు నియోజకవర్గ శాసనసభ్యులు 15వ తేదీ పుత్తూరు గ్రామంలో రైతు సేవ కేంద్రాన్ని ప్రారంభిస్తారని, ఆ ప్రారంభానికి ముందే గతంలో సమన్వయ లోపం వల్ల జరిగిన పొరపాటు ఉద్దేశ్యపర్వకంగా కాదని స్థానిక ఎంపీడీవో త్రివిక్రమ రావు తెలియజేశారు ఆ

ప్రోటోకాల్ లేని వ్యక్తుల పేర్లు తొలగింపు

ప్రోటోకాల్. లేని పేర్లను ప్రస్తుతం తొలగించారని అది ఎంత మాత్రం ఉద్దేశం పూర్వకంగా జరిగింది కాదని ఎంపీడీవో వివరణ ఇచ్చారు. పుత్తూరు లోని రైతు సేవా కేంద్రం లోని శిలాఫలకంపై ప్రోటోకాల్ లేని వ్యక్తుల పేర్లు తొలగింపు పై స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు .

అరణియార్‌కు కృష్ణా జలాలు తరలించండి

మంత్రులకు ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి - సత్యవేడు: కెవిబి పురం మండలం ఓల్లూరు చెరువు, కాలంగి రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు చేపట్టాలని మంత్రి నిర్మల రామానాయుడుకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.త్యవేడలో మంజూరైన టిటిడి కళ్యాణ మండపం పనులను ఆదివారం ప్రారంభించాలని దేవాదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని ఎమ్మెల్యే కోరారు. ఈ మేరకు మంత్రులకు ఎమ్మెల్యే వినతిపత్రం అందించారు. మంత్రులు తన వినతులకు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వెల్లడించారు. అంతకు ముందు మంత్రులను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సర్వేపల్లి, సూళ్లూరుపేట, వెంకటగిరి ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, విజయశ్రీ, కె రామకృష్ణ, అధికారులు, టిడిపి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న మంత్రులు

సమస్యలు పరిష్కరిస్తా..

- అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి కల్పనే లక్ష్యం
- విశ్రాంత ఉద్యోగుల సన్మాన సభలో ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి - రామచంద్రాపురం: చంద్రగిరి నియోజక వర్గంలోని విశ్రాంత మాజీ మిలిటరీ, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్(నాని) అన్నారు. చంద్రగిరిలో ఏపీ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం, మాజీ మిలటరీ ఉద్యోగులు సంఘాలు సంయుక్తంగా ఎమ్మెల్యే పులివర్తి నానికి ఆదివారం ఘన సన్మానం చేశారు. ఎమ్మెల్యేకు విశ్రాంత ఉద్యోగులు మంగళ వాయిద్యాలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా చంద్రగిరి అభివృద్ధికి నోచుకోక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు పడి వుందని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రగిరిలో అత్యధిక సాంకేతిక పరిజ్ఞానం కూడిన (గోవింద దామం) తరహాలో శ్మశాన వాటిక ఏర్పాటు చేస్తానన్నారు. జాతీయ రహదారి నాగాలమ్మ దేవాలయం నుండి శ్రీనివాస మంగాపురం వరకు వంద అడుగుల రోడ్డు నిర్మాణం చేపట్టి, వివిధ ప్రాంతాల నుండి తిరుమలకు వెళ్లేందుకు నడచి వచ్చే శ్రీవారి భక్తుల కోసం విశ్రాంతి మందిరాన్ని ఏర్పాటు చేస్తానన్నారు. రాజకీయాలకు అతీతంగా పేద ప్రజల సంక్షేమం కోసం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే తన ధ్యేయంగా పని చేస్తానని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు తనను ఆశీర్వదించి, సన్మానించడం ఆనందంగా వుందన్నారు. చంద్రగిరిలో అభివృద్ధికి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మాజీ మిలిటరీ ఉద్యోగులు, ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు అడిగిన సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విశ్రాంత ఉద్యోగ సంఘాలు నాయ కులు ఎమ్మెల్యే పులివర్తి నానిని దుశ్శాలువ, గజ మాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత మిలటరీ ఉద్యోగుల సంఘాల నాయకులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగ సంఘాల నాయకులు, స్థానిక టిడిపి నాయకులు వి సుబ్రహ్మణ్యం నాయుడు, గౌస్ బాషా, పి రమేష్ రెడ్డి, వేణుగోపాల్, సింగ్ సుధారాణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి -రేణిగుంట: ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గెలిచిన నెల రోజుల లోపే మాట నిలబెట్టుకొని మంచినీళ్లు అందించిన స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి గ్రామ ప్రజల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు టిడిపి వెంకటాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు నాధముని రెడ్డి అన్నారు. రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీ లోని అన్నాసంపల్లి, అల్లి మిట్ట గ్రామాలలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి తాగునీటి బోర్లను ప్రారంభించారు. ఎన్నికల ప్రచారంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ప్రజలు రిషితా రెడ్డి దృష్టికి తీసుకొని వచ్చారు అధికారంలోకి వచ్చిన వెంటనే మీకు తాగునీటి సమస్య తీరుస్తామని ఆనాటి హామీ ప్రకారం నేడు అధికారంలోకి రాగానే రెండు బోర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షుడు నాధముని రెడ్డి మాట్లాడుతూ ముందు గ్రామ ప్రజలు తరపున రిషితమ్మకు, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. గ్రామస్తులు పడుతున్న నీటి కష్టాలు నేటితో పరిష్కారం అయ్యాయన్నారు. ఇంకా గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుళ్లాలని త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్‌బాషా, భాస్కర్ రెడ్డి, వెంకటముని రెడ్డి, ఉమామహేశ్వర్, చిన్నపరెడ్డి, కుమార్ రెడ్డి, ముని శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో శుభ్రత

- చెత్త, వ్యర్థాల తొలగింపు

ప్రజాశక్తి-వికోట: వీకోట పోలీస్ స్టేషన్‌లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను ఆదివారం పోలీసులు పరిశుభ్రం చేశారు. దుమ్ము, ధూళి, పాత వాహనాల వేస్ట్ సామగ్రిని సీఐ లింగప్ప దగ్గరుండి శుభ్రం చేయించారు. ఆవరణంలో కాగితాలు, పాత సామన్లును తొలగించారు. చిత్తూరు ఎస్పి త్వరలో వీకోట స్టేషన్‌ను సందర్శించనున్న నేపథ్యంలో స్టేషన్‌లో పరిశ్రుభ్రతపై చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. కాగా ఇప్పటి స్టేషన్‌లో అన్ని రికార్డులు అప్‌డేట్ చేసినట్లు సమాచారం. ఫిర్యాదుదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. పోలీస్‌స్టేషన్‌లో పరిశుభ్రతపై చర్యలు చేపట్టడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

సర్పంచ్ చొరవ.. తీరిన నీటి సమస్య

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు:

మండలంలోని తూగుండ్రం గ్రామంలో నీటి సమస్య ఏర్పడింది. ఆ గ్రామంలో 200కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. సరిపడా నీళ్లు రాక సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సర్పంచ్ బాబు చొరవతో ఆదివారం చెరువులో పంచాయతీ వారు బోరు వేయించారు. దీంతో బోరులో నీళ్లు పడ్డాయి. గ్రామ సమస్య తీరడంతో పలువురు సర్పంచ్‌కు అభినందనలు తెలిపారు. సర్పంచ్‌తో పాటు ఎంపీటీసీ వాణిశ్రీ కేశవులు, మాజీ సర్పంచ్ నియాజ్ అలీ, నీరజాక్షులురెడ్డి, శేఖర్, చిట్టిబాబు, జీవరత్నం ఉన్నారు.

సంత మారింది.. సమస్య తీరింది.!

- దీర్ఘకాల సమస్యకు ప్రజాశక్తి వార్తతో పరిష్కారం
- పలువురి అభినందనలు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: నాలుగు ప్రధాన నగరాలకు వెళ్లే రహదారులకు కేంద్రం పచ్చికాపల్లం. ప్రతీ అవసరానికి 200గ్రామాలకు చెందిన ప్రజలకు అక్కడి వస్తుంటారు. పచ్చికాపల్లంలో ప్రతి ఆదివారం వారపు సంత జరుగుతుంది. సంత స్థలంలో కాకుండా అక్కడి వ్యాపారస్తులు, రైతులు రోడ్డుపై విక్రయాలు జరుపుతుంటారు. ఈ క్రమంలో ఆదివారం అధిక సంఖ్యలో అక్కడికి వచ్చే ప్రజలు, భారీ వాహనాలు, బైక్‌లు, కార్లు ఇబ్బంది పడుతుంటారు. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిపోయి ట్రాఫిక్‌కి అంతరాయం కలిగేది. స్థానికులు ఇబ్బంది పడేవారు. ఈ విషయంగా గత మంగళవారం ప్రజాశక్తిలో 'సమస్యల సంత.. పట్టించుకోండి కొంత' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఈవోపీఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శి, పోలీసులు సమన్వయంతో సంత సొంత స్థలాన్ని శుక్రవారం శుభ్రం చేయించారు. ఆదివారం ఉదయం నుంచి అక్కడి వచ్చే వ్యాపారస్తులు, రైతులను నేరుగా సంత స్థలంలో నిర్వహణ చేపట్టాలని సూచించారు. రైతులు విశాలమైన సంత స్థలంలో వ్యాపారాలు సాగించారు. ఇన్నాళ్లు ఆదివారమైతే ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడ్డ ప్రజలకు ఉపశమనం లభించింది. సమస్యను గుర్తించి వార్త ప్రచురించి అధికారుల్లో చలనం తీసుకొచ్చిన ప్రజాశక్తికి పలువురు అభినందనలు తెలిపారు. అధికారుల చర్యల పట్ల హర్షం వ్యక్తం చేశారు.

సౌకర్యాలు కల్పించాలని..

ప్రతి ఆదివారం నిర్వహించే ఈ సంత స్థలంలో అనేక మంది ప్రజలు వస్తుంటారు. అక్కడ శాశ్వత షెడ్లు, ప్రహరీ, మరుగుదొడ్లు నిర్మాణం, నీటి సౌకర్యం కల్పించేలా పాలకులు చొరవ చూపాలని పలువురు కోరారు. ప్రజలకు సౌకర్యవంతంగా సంత నిర్వహించుకొనేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పోలీసులకు వినతిపత్రం అందిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డవారిని అరెస్టు చేయాలి

ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలో గత వారం రోజుల క్రితం ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడి చేసిన నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ప్రజా సంఘాల నాయకులు ఏర్పేడు పోలీసులో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ సభ్య సమాజంలో ఇలాంటి అఘాయిత్యాలు జరుగుతున్నప్పటికీ చర్యలు తీసుకోవడంలో మాత్రం ప్రభుత్వాలు, అధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు. ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని వుంటే ఎలా పునరావృతం కాకుండా ఉంటుందని చెప్పారు. వెంటనే బాధితుడు బలరామయ్య గౌడ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు అయ్యి 48 గంటలు అవుతున్న బాధితుడని అరెస్టు చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ అఘాయిత్యానికి సంబంధించి నిందితుడికి సహకరించిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కలపాటి గురవమ్మ, వాసుదేవులు, గాలి రవి, చికోలు నారాయణ, పరమాల హరిబాబు, జయచంద్ర పాల్గొన్నారు.

జన సైనికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

జనసేన సైనికుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండలం కొలడం గ్రామంలో కొద్దీ రోజుల క్రితం మృతి చెందిన జనసైనికుడు వంశీ కుటుంబాన్ని స్థానిక జనసేన నాయకులు ఆదివారం పరామర్శించి, మండల అధ్యక్షులు కూరాకుల రూపే ష్, నాయకుల సమక్షంలో నియోజక వర్గ ఇన్‌ఛార్జి కొప్పుల లావణ్య కుమార్, జిల్లా కార్యదర్శి హేమకుమార్, నాగలాపురం మండల అధ్యక్షులు మణికంఠ చేతుల మీదుగా 20,500 రూపాయలు ఆర్థిక సాయం ఆదివారం అందించారు. లావణ్య కుమార్, రూపేష్ మాట్లాడుతూ వంశీ సోదరుడు సదమయ్యకు మంచి ఉద్యోగం ఇప్పించి కుటుంబానికి ఎప్పుడు ఎలాంటి అవసరం వచ్చినా అండగా వుంటామని వంశీ తల్లి నిర్మల, తండ్రి చిన్న రాసుతో మాట్లాడుతూ వాళ్లకు ధైర్యం అందించారు. వంశీ మృతి జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లి సాయం చేస్తామని తెలిపారు. ఆయన పార్టీ కోసం చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు.

చిన్నబ్బ నాయుడుకి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): మండలంలోని నారావారిపల్లికి చెందిన నారా చినబ్బ నాయుడు (నారా ప్రభాకర్ నాయుడు) మృతి టిడిపికి తీరని లోటు అని స్థానిక ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) అన్నారు. నారా చిన్నబ్బ నాయుడు కర్మక్రియలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే చిన్నబ్బ కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం తెలిపారు. చిన్నబ్బ నాయుడు క్రమశిక్షణ కలిగిన కార్యకర్త అని, పార్టీకి పట్టు కొమ్మ లాంటివారని ఎమ్మెల్యే కొనియాడారు. అనంతరం చిన్నబ్బ నాయు డు చిత్ర పటానికి ఎమ్మెల్యే పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి చంద్రగిరి మండల అధ్యక్షులు పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి హేమాంబరధరావు, ఏజిపల్లి బాల, గౌస్ బాష పాల్గొన్నారు.

పెరటి మిద్దె తోటలపై అవగాహన కల్పిస్తున్న అతిథి కెటి రామకృష్ణారెడ్డి

పెరటి మిద్దె తోటలను ప్రోత్సహించాలి..

ప్రజాశక్తి - క్యాంపస్ : అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ పెరటి మిద్దె తోటలను పెంచాలని ఎస్వీయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కేటి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. తిరుపతి పద్మావతిపురంలో ఆదివారం 'ఒన్ ఎర్త్-ఒన్ లైఫ్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తిరుపతిలోని పెరటి మిద్ది తోటల పెంపకం దారులు 'ఒన్ ఎర్త్-ఒన్ లైఫ్' ఆధ్వర్యంలో ప్రారంభ అవగాహన కల్పించడంలో భాగంగా ఆచార్య రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం అందరూ ఆరోగ్యంగా జీవించాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ప్రతి ఇంట్లో కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల తోటలో పెంచుకోవాలని సూచించారు. ఇందుకోసం ఈ సంస్థ చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న పెరటి మిద్ది తోటల పెంపకం దారులకు ఉచితంగా 30 రకాల నాటు ఆకుకూరలు, కాయగూరల బండ్ల విత్తనాలతో పాటు బంతి, చామంతి, మందారం, బచ్చలి, తమలపాకు మొక్కలను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, భానుప్రియ, శృతి, పలువురు మిద్దె తోటల పెంపకం దారులు పాల్గొన్నారు.

19న తాత్కాలిక అంగళ్లకు వేలం పాట

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు ద్రౌపది దేవి సమేత ధర్మ రాజుల స్వామి దేవస్థానంలో ఆగస్టు 11వ తేదీ నుండి 28వ తేదీ వరకు నిర్వహించనున్న (ద్రౌపది దేవి తిరునాళ్లు) బ్రహ్మోత్సవాల సందర్భంగా తోపు ఆవరణలో తాత్కాలిక అంగళ్లు కోసం ఈనెల 19వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు లక్కీ డీప్ పద్ధతిన వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఆదివారం పేర్కొన్నారు. ఈ వేలం లక్కీ డీప్ ద్వారా వేలం మొత్తం రూ.10 లక్షల రూపాయలు నిర్ధారించామన్నారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు డిపాజిట్ గా 25 వేల రూపాయలు చెల్లించి లక్కీడీప్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. డీప్‌లో పేరు వచ్చిన వారిని మినహాయించి మిగతా వారు కట్టిన డిపాజిట్‌ను వాపసు ఇవ్వరని పేర్కొన్నారు. లక్కీ డీప్ లో పేరు వచ్చిన వారు ఆలయం వారి వద్ద వెంటనే మొత్తం పైకం వెంటనే చెల్లించి రసీదు పొందాలన్నారు.

మాతమ్మకు సారె సమర్పణ

ప్రజాశక్తి -రామచంద్రాపురం: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట పంచాయతీ ఉప్పరపల్లి గ్రామంలో మాతమ్మ తిరునాళ్లు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా టీడీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్ రెడ్డి ఆదివారం మాతమ్మ కు సారే సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్ల కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆయురారోగ్యాలు ఇవ్వాలని, చల్లగా చూడాలని వేడుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్ర, , రామానాయుడు, రాజా రాయల్, రేవంత్ రెడ్డి, భాస్కర్ రెడ్డి గ్రామస్తులు చెంచు శేఖర్ పాల్గొన్నారు.

టిడిపి నాయకుల పాదయాత్ర

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): ఎన్నికలకు ముందు ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తే తిరుమలకు పాదయాత్ర చేస్తానని గుంటూరు జిల్లా కొల్లూరు మండలం మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధు మొక్కుకున్నారు. ఎన్నికల అనంతరం చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయడంతో బాపట్ల జిల్లాలోని వేమూరు నియోజకవర్గం కొల్లూరు మండలం నుండి కనగాల మధు 14 రోజుల క్రితం తిరుమలకు పాదయాత్ర ప్రారంభించారు. ఈ పాదయాత్రకు బాపట్ల ఎమ్మెల్యే వేగినేశన నరేంద్ర వర్మ సంఘీభావం తెలిపి ముందుకు నడిపించారు. దాదాపు 14 రోజులపాటు 400 కిలోమీటర్లు సాగిన టిడిపి నాయకుల మహా పాదయాత్ర ఆదివారం తిరుపతికి చేరింది. ఈ పాదయాత్ర నిర్వాహకులకు టిడిపి రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతి నిధి కరణం హిమ్మత్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.